

25వ డివిజన్‌లో గడపగడపకు...

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో 25వ డివిజన్‌లోని బేతవీధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. లబ్ధిదారులు వివరాలతో కూడిన బుక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి డివిజన్ ఇన్‌ఛార్జి యడ్ల రాజేష్, నాయకులు కిరణ్ కుమార్, ఆడారి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

రుణం కావాలంటే.. కమీషన్ కొట్టాల్సిందే

- మెప్మాలో రాజ్యమేలుతున్న అవినీతి డ్వాక్రా సభ్యుల నుంచి వసూళ్లు
- లంచం ఎందుకని ప్రశ్నిస్తే బ్యాంకు లింకేజీ రుణం వెనక్కి తీసుకున్న వైనం

అవినీతి రహిత పాలన అందిస్తామని సాక్షాత్తూ సిఎం జగన్మోహన్‌రెడ్డి ఓ వైపు ప్రకటిస్తుంటే, కిందిస్థాయిలో మాత్రం అవినీతి లేనిదే పనులు జరగడం లేదని చర్చ నడుస్తోంది. బొబ్బిలి మున్సిపాలిటీలో బ్యాంకు లింకేజీ రుణం తీసుకున్న డ్వాక్రా సభ్యులు.. మెప్మా సిబ్బందికి, ఆర్‌పిలకు లంచాలు ఇవ్వాల్సిందే. లంచాలు ఇవ్వకపోతే రుణాలు మంజూరు కావని బెదిరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. లంచం ఎందుకని ప్రశ్నించినందుకు ఆ గ్రూపు సభ్యురాలి రుణం డబ్బులు వెనక్కి తీసుకున్న సంఘటన తాజాగా వెలుగుచూసింది.

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని కోరాడవీధిలో శ్రీలక్ష్మి పొదుపు సంఘంలో పూల్‌బాగ్‌కు చెందిన సుంకర రమణమ్మ సభ్యులుగా ఉన్నారు. బొబ్బిలి, పాత బొబ్బిలిలో ఇంటి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్న రమణమ్మ ఏ నెల కూడా బ్యాంకు రుణం, పొదుపు డబ్బులు చెల్లించడంలో జాప్యం చేయలేదు. వారం క్రితం శ్రీలక్ష్మి పొదుపు సంఘానికి బ్యాంకు లింకేజీ రుణం మంజూరైంది. ఒక్కొక్కరికి రూ.70 వేలు చొప్పున రుణం వచ్చింది. ఐదు రోజుల క్రితం సుంకర రమణమ్మ కుమార్తె పద్మకు గ్రూపు అధ్యక్షులు రాధ ఫోన్ చేయగా, రుణం డబ్బులు కోసం రమణమ్మ వెళ్లారు. రమణమ్మకు రెండు కట్టల నగదు ఇచ్చి, ఆమె కుమార్తె పద్మకు రాధ ఫోన్ చేసి 'మీఅమ్మకు రూ.70 వేలు లోన్ వచ్చింది. రూ.700 కట్ చేసి మిగతా డబ్బులు ఇచ్చా'మని చెప్పారు. 700 ఎందుకు కట్ చేశారని ఫోన్‌లో పద్మ ప్రశ్నిస్తే, పొదుపు సంఘం ప్రెసిడెంట్ రాధకు కోపమొచ్చి రమణమ్మ దగ్గర ఉన్న డబ్బులు లాక్కుని ఇంటింటికి పంపిచేశారు. రమణమ్మ ఆందోళనకు గురై, రాధ ఇంటి మెట్లు దిగుతుండగా పడిపోవడంతో ఆమె కాలికి గాయమైంది.

ఆర్‌పిలు, మెప్మా సిబలకు లంచాలు

రుణం డబ్బుల నుంచి రూ.700 ఎందుకు కట్ చేశారని రమణమ్మ కుమార్తె పద్మ ప్రశ్నించగా ఆర్‌పిలు, మెప్మా సిబలకు డబ్బులు ఇవ్వాలని సమాధానం చెప్పారు. సిఒకు రూ.1500, ఆర్‌పికి రూ.1000, గ్రూపు అధ్యక్ష, కార్యదర్శులకు ఒక్కొక్కరికి రూ.1000, పరుపుల లక్ష్మికి రూ.500 ఇవ్వాలని, అందుకే ఒక్కొక్కరు నుంచి రూ.700 చొప్పున వసూలు చేస్తున్నామని ఫోన్‌లో వాటాల వివరాలు రాధ తెలియజేశారు. రుణం డబ్బులు పూర్తిగా ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని రమణమ్మ అధికారులను కోరారు.

మెప్మాలో అవినీతి

బొబ్బిలి మున్సిపాలిటీ మెప్మాలో అవినీతి జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. బ్యాంక్ లింకేజీ రుణాలు మంజూరు అవుతున్న ప్రతి గ్రూపు నుంచి రూ.వేలల్లో అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. గ్రూపు సభ్యుల నుంచి వసూలు చేస్తున్న డబ్బులు గ్రూపు అధ్యక్ష, కార్యదర్శుల నుంచి తీసుకుని, మెప్మా అధికారులు పంచుకుంటున్నట్లు పట్టణంలో చర్చ సాగుతోంది. ఎవరైనా కమీషన్ ఇవ్వకుంటే ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిసింది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో కమీషన్ ఇస్తున్నట్లు డ్వాక్రా సభ్యులు చెబుతున్నారు.



బ్యాంకు లింకేజీ రుణం డబ్బులు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న సుంకర రమణమ్మ

సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు

డ్వాక్రా గ్రూపు సభ్యుల నుంచి అక్రమ వసూళ్లపై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని మెప్మా టిపిఆర్ఒ జగన్మోహన్ చెప్పారు. డ్వాక్రా సంఘాల సభ్యుల నుంచి అక్రమ వసూళ్లు చేయడం నేరమని స్పష్టంచేశారు. అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వీడని ఏనుగుల భయం

బిక్కుబిక్కుమంటున్న రైతులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిల్లాలో అడవి ఏనుగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూ కనిపిస్తోంది. ఒకప్పుడు కేవలం కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలకే పరిమితమైన అడవి ఏనుగులు గుంపు సంఖ్య ప్రస్తుతం జిల్లాలోని మూడు గుంపులుగా నాలుగు దిక్కులకు పాకింది. కురుపాం, జియ్యమ్మవలస, వీరఘట్టం, గరుగుబిల్లి మండలాల్లో అడవి ఏనుగుల సంచారంతో ప్రజలు, రైతుల కంటిమీద కునుకులేకుండా కాలం వెల్లదీస్తున్నారు. రైతులు పండించే పంటలను సర్వనాశనం చేస్తున్నాయి. సరిగ్గా 17 ఏళ్ల క్రిందట ఒడిశా లకేరి అడవుల నుంచి గుమ్మలక్ష్మీపురం మన్య ప్రాంతానికి వచ్చిన అడవి ఏనుగులకు పుష్కలమైన నీరు, ఆహారం అందుబాటులో ఉండడంతో ఈ ప్రాంతంలో ఆవాసం ఏర్పర్చుకున్నాయి. ఒడిశాలో ఫ్యాక్టరీల పేరుతో అడవులను నాశనం చేయడంతో అడవిలో ఉండాల్సిన ఏనుగులకు రక్షణ కరువై, ఆహారం దొరక్క ఇలా జనావాసాల్లోకి వస్తున్నాయని అంటున్నారు. అడవుల్లో ఉండాల్సిన వన్యప్రాణులు ప్రజల మధ్య తిరుగుతూ వారి ప్రాణాలను, పంటలను సర్వ నాశనం చేస్తూ జనజీవనానికి ఆటంకంగా మారాయి. అసలే ఖరీఫ్ సీజన్ రైతులు వేసుకున్న వరి పంట, అరటి, మొక్కజొన్న పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. రైతులు పంట పొలాలకు వెళ్లలేక, ఇంటి వద్ద ఉండలేక బిక్కు బిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఏ క్షణానికి ఏనుగుల గుంపు గ్రామంపై దాడి చేస్తుందోనని ప్రజలు అనుక్షణం భయపడుతున్నారు. ఏనుగుల దాడిలో ఇప్పటివరకు సుమారు 15 మంది వరకు గిరిజనులు, రైతులు మృత్యువాత పడ్డారు. ఏనుగులు ప్రజల ప్రాణాలను తీస్తున్నా అటు ప్రభుత్వం, ఇటు పాలకులు ఏనుగులను తరలించడం, ప్రజలకు రక్షణ కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందాయని పలువురు గిరిజన సంఘాల నాయకులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో అడవి ఏనుగుల బెడద ఇంకా ఎంత కాలమో అంటూ ప్రజల గగ్గోలు పెడుతున్నారు. ప్రజల ప్రాణాలు తీయకముందే వాటిని తరలించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని కోరుతున్నారు.



సంచరిస్తున్న ఏనుగుల గుంపు

సంగెడ్డలో ఏనుగుల గుంపు సంచారం

కురుపాం : ఏనుగులు గుంపు కురుపాం పంచాయతీ నుంచి గుమ్మిడిగూడ పంచాయతీ సంగెడ్డ పరిసర ప్రాంతాల్లో పొలాల్లోకి చేరుకున్నాయి. గుమ్మడిగెడ్డకు అత్యంత సమీపంలో ఈ పొలాలు ఉన్నాయి. గుంపులో చిన్న ఏనుగు పిల్లలు ఉండడంతో గుమ్మడిగెడ్డలో పెద్ద పెద్ద గోతులు ఉండడం వల్ల జరగరాని ప్రమాదం జరిగితే చిన్న ఏనుగులు అందులో పడి మృతి చెందడం ఖాయమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పంట పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ కొన్ని చోట్ల ఉన్నాయని, గతంలో మాదిరిగా విద్యుత్ ప్రమాదం జరగకుండా అటవీశాఖ అధికారులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు. ఏనుగులకు అవసరమైన నీరు, ఆహారం ఒకే చోట ఇక్కడ లభించే అవకాశం ఎక్కువగా ఉందని ఎవరికీ హాని తలపెట్టకుండా ఉంటే ఎన్నాళ్లు ఉన్న అభ్యంతరం లేదని రైతులు పేర్కొన్నారు.

ఏనుగులను తరలించాలి

జిల్లాలోని ప్రజల ప్రాణాలను తీస్తున్న అడవి ఏనుగుల గుంపును ఈ ప్రాంతం నుంచి ఒడిశా ప్రాంతానికి తరలించేలా ప్రభుత్వం, అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టాలి. ఏనుగుల దాడితో విలువైన ప్రాణాలు, పంట నష్టం, ఆస్తి నష్టం జరుగుతున్నా ప్రభుత్వం రక్షణ చర్యలు తీసుకోకపోవడం శోచనీయం.

- కోలక అవినాష్,
ఆదివాసీ గిరిజన సంఘం మన్యం జిల్లా కార్యదర్శి

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో

సీట్ల అమ్మకం సరికాదు : జెవివి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వం నూతనంగా ప్రారంభిస్తున్న వైద్య కళాశాలల్లో సీట్లను అమ్మకానికి పెట్టడం తగదని, దీని వల్ల పేద విద్యార్థులు నష్టపోతారని జన విజ్ఞాన వేదిక తెలిపింది. అర్హత ఉన్నప్పటికీ ఆర్థిక స్తోమత లేని కారణంగా ప్రభుత్వ వైద్య కళాశాలల్లో చదువుకొనే అవకాశం కోల్పోవడం అన్యాయమని, డబ్బు ప్రసక్తి లేకుండా అర్హులైన విద్యార్థులందరికీ సమాన అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు జెవివి నగర మహాసభలో తీర్మానించింది. ఆదివారం జిల్లా పరిషత్తు మినిస్టీరియల్ హాల్లో జనవిజ్ఞాన వేదిక నగర మహాసభను నగర అధ్యక్షులు కె.మురళీబాబు అధ్యక్షతన నిర్వహించారు. మహాసభలో గ్రంథాలయాల నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వాల పరిధి నుండి కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నట్లు సాగుతున్న ప్రచారం ఆందోళన కలిగిస్తోందని మహాసభ మరో తీర్మానంలో ప్రకటించింది. కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవిఎన్ వెంకట్రావు, పి.రమణ ప్రభాత్, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ , సమతా మహిళా విభాగం జిల్లా కన్వీనర్ జి.నిర్మల, తదితరులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న జెవివి జిల్లా అధ్యక్షులు వెంకటరావు

నూతన కమిటీ ఎన్నిక

మహాసభలో నగర నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా ఎల్.చిన్నారి, ఉపాధ్యక్షులుగా జి.నిర్మల, ఆర్.మహేష్, ఎం. ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కె.శశిధర్, కార్యదర్శిగా దిలీప్ చక్రవర్తి, కార్యదర్శులుగా సతీష్, చంద్రశేఖర్, కోశాధికారిగా సిహెచ్ సింహాచలం ఎన్నికయ్యారు. చంద్రశేఖర్ కన్వీనర్‌గా 13 మందితో యూత్ కమిటీ, జి.నిర్మల కన్వీనర్‌గా 20 మందితో సమతా మహిళా కమిటీని ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా వి.రాజగోపాల్ వ్యవహరించారు.

ఎపిఎల్ విజయవంతానికి 3కె రన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 16 నుంచి 27 వరకు విశాఖలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి క్రికెట్ మైదానంలో నిర్వహించే ఆంధ్రా ప్రీమియర్ లీగ్ సీజన్-2ను విజయవంతం చేయాలని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు కోరారు. ఈ మేరకు ఎపిఎల్ విజయవంతానికి నగరంలోని విజ్జీ స్టేడియం నుంచి కోట జంక్షన్ వరకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మన ఆంధ్ర- మన ఎపిఎల్ నినాదంతో 3కె రన్‌ను ఆదివారం నిర్వహించారు. ముందుగా క్రీడాజ్యోతిని ఆయన వెలిగించి జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్‌కు అందజేశారు. ఆయన క్రీడాజ్యోతిని స్థానిక రంజీ ప్లేయర్ పి.తపస్వీ చేతికి అందించి, ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎన్ రాజు మాట్లాడుతూ ఐపిఎల్ తరహాలో నిర్వహించే ఈ టోర్నీ జిల్లా క్రికెట్ క్రీడాకారులకు వరమని తెలిపారు. ఎపిఎల్ చూసేందుకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు తెలిపారు. వర్ధమాన క్రికెటర్లకు ఎపిఎల్ తొలిమెట్టని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్ తెలిపారు. ఎపిఎల్‌ను సద్వినియోగం చేసుకోవాలని సెట్విజ్ సిఇఒ రాంగోపాల్ కోరారు. కార్యక్రమంలో నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ చైర్మన్ సన్యాసిరాజు, సెలెక్టర్లు పి బంగార్రాజు, ఎంఎస్ఎన్ వర్మ, ఎంసిఎ కోచ్ రతన్, తదితరులు పాల్గొన్నారు.



3కె రన్‌లో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు



రక్తదాతలను అభినందిస్తున్న డాక్టర్ శ్రీరామ్మూర్తి

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా మదర్ థెరిసా సేవా సంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్, మదర్ థెరిసా కిడ్స్ స్కూల్ సంయుక్తంగా అయ్యన్నపేట జంక్షన్‌లోని కిడ్స్ స్కూల్లో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని శ్రీసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఎ.శ్రీరామ్మూర్తి ప్రారంభించారు. అనంతరం శ్రీరామ్మూర్తిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరిసా సేవా సంఘం అధ్యక్షులు త్యాడ ప్రసాద్ పట్నాయక్, గౌరవ అధ్యక్షులు త్యాడ వేణుగోపాలం, సభ్యులు శ్రీనివాస్, తనీష్, మనోజ్, సాయి, అంజనీపుత్ర చిరంజీవి బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షులు త్యాడ రామకృష్ణారావు పాల్గొన్నారు.

నైట్ స్టార్మింగ్‌తో రాత్రి నేరాలకు చెక్

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలో రాత్రి విచ్చలవిడిగా సంచరించడం, బైకు రేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, గంజాయి రవాణాకు స్వస్తి పలికేందుకు ఆకస్మికంగా నైట్ స్టార్మింగ్ చేపడుతున్నామని వన్‌టౌన్ సిఐ బి.వెంకటరావు తెలిపారు. నైట్ స్టార్మింగ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి నగరంలో విజయనగరం డిఎస్‌పి ఆర్.గోవిందరావు ఆధ్వర్యంలో వన్ టౌన్ సిఐ బి వెంకటరావు, 12 మంది ఎస్ఐలు, 70 మంది పోలీసు సిబ్బంది ఈ నైట్ స్టార్మింగ్‌లో పాల్గొని, అర్ధరాత్రి గస్తీ ముమ్మరం చేశారు. ఈ దాడుల్లో 22 డ్రంకన్ డ్రైవ్ కేసులు, 10 మందిపై ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదుచేశారు. వాహన రికార్డులు సక్రమంగా లేని రెండు వాహనాలు సీజ్ చేశారు. నైట్ స్టార్మింగ్ నిర్వహణలో చేపట్టాల్సిన విధులు, వ్యవహరించాల్సిన తీరు పట్ల సిబ్బందికి ముందుగా సిఐ వెంకటరావు అవగాహన కల్పించారు. కారణం లేకుండా అర్ధ రాత్రి సమయాల్లో తిరిగే యువత, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టడంతోపాటు వారిపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. రికార్డులు లేకుండా వాహనాలు నడిపినా, బైకు రేసులు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు అశోక్ కుమార్, భాస్కరరావు, మురళి, రామ గణేష్, షేక్ శంకర్, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.



డ్రంక్‌అండ్‌డ్రైవ్ టెస్ట్ చేస్తున్న సిఐ వెంకటరావు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వన్‌టౌన్ సిఐ వెంకటరావు సూచించారు. వన్‌టౌన్ పోలీసు స్టేషనులో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. అతి వేగం కన్నా ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని, నిబంధనల మేరకు నడుచుకోవాలని ఆటో డ్రైవర్లకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వేరొకరికి జీవితాన్ని ప్రసాదించే అవయవ దానం ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని సాయి ఆసుపత్రి వైద్యులు ఎ.శ్రీరామ్మూర్తి విజ్ఞప్తిచేశారు. ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. సాయి ఆసుపత్రి వైద్య సిబ్బంది, నర్సింగ్ విద్యార్థినులు నిర్వహించిన ఈ ర్యాలీని ఆస్పత్రి వద్ద ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాస్త్రం అభివృద్ధి చెందిన ఫలితంగా అవయవదానానికి అవకాశం ఏర్పడిందన్నారు. ఈ అవయవాల మార్పిడి వల్ల మరొకరిని బతికించే అవకాశం దాతకు కలుగుతుందన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు

- విద్యుత్తు కోతలు లేకుండా చర్యలు
- రైతులకు 9 గంటల విద్యుత్తు
- 'ప్రజాశక్తి'తో ఇపిడిసిఎల్ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు ముఖాముఖి

జిల్లాలో వినియోగదారులకు మెరుగైన విద్యుత్తు సేవలు అందించడమే లక్ష్యమని ఎపిఇపిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.లక్ష్మణరావు తెలిపారు. విద్యుత్తు కోతలు లేకుండా సరఫరా అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. రైతులకు తొమ్మిది గంటల విద్యుత్తు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. విద్యుత్తు ప్రమాదాల నివారణకు ప్రజల సహకారం అవసరమని తెలిపారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

- ప్రజాశక్తి, విజయనగరం టౌన్



కొద్దిరోజులుగా విద్యుత్తు కోతలు పెరిగాయి. వాటి నివారణకు తీసుకున్న చర్యలు ఏమిటి?.

జిల్లాలో కొద్ది రోజులుగా అక్కడక్కడ ఇఎల్ఆర్ పేరిట విద్యుత్తు కోతలు విధించడం వాస్తవం. పవన విద్యుత్తు సరఫరా తగ్గడం వల్ల అంతరాయం ఏర్పడింది. గృహాలకు, కమర్షియల్ సంస్థలకు విద్యుత్తు కోతలు లేకుండా చూడాలని, పరిశ్రమలు పని గంటలను తగ్గించుకొనే విధంగా ప్రభుత్వం ఆదేశించింది. గృహ వినియోగదారులకు విద్యుత్తు కోతలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

జగనన్న కాలనీల్లో విద్యుత్తు సరఫరాకు తీసుకున్న చర్యలు ఏమిటి?

జిల్లాలోని జగనన్న కాలనీల్లో ఇప్పటివరకు 30,365 ఇళ్లకు విద్యుత్తు సరఫరా ఇచ్చాం. జగనన్న కాలనీలకు విద్యుత్తు సరఫరా కోసం రామన్నదొరవలస, గుమడాం, గుంకలాం ప్రాంతాల్లో సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నాం. ఉమ్మడి జిల్లాల్లో జగనన్న కాలనీల్లో విద్యుత్తు సౌకర్యం కల్పించడం కోసం ఇప్పటివరకు రూ.38.83 కోట్లు ఖర్చు చేశాం.

జిల్లాలో మెరుగైన విద్యుత్తు సరఫరా కోసం తీసుకుంటున్న చర్యలు ఏమిటి?.

జిల్లాల్లో 24 గంటల విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చేయాలనే ఉద్దేశంతో కొన్ని ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం కూడా ఆర్‌డిఎస్ఎస్ పథకం కింద ప్రతిపాదనలు కోరింది. దీనిపై సర్వే చేపట్టి, ఏడాదిలోగా పూర్తి నివేదిక, ప్రతిపాదనలు తయారు చేసి పంపించాలి.

విద్యుత్తు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న జాగ్రత్తలు ఏమిటి?.

జిల్లాలో ఎటువంటి ప్రమాదం జరగకుండా సాధ్యమైనంత వరకు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రజల సహకారం ద్వారానే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుంది. విద్యుత్తు లైన్లు, స్థంభాలు, సరఫరాలో ఏ చిన్న సమస్య ఉన్నా వెంటనే 1912 నంబరుకు ఫోన్ చేయాలి. అందుబాటులో సిబ్బందికీ తెలియజేయొచ్చు. ఇటీవల జిల్లాలో జరిగిన ప్రమాదాలు అవగాహన రాహిత్యం వల్ల సంభవించాయి. అలాంటి వాటికి తావివ్వకుండా ప్రజలు టోల్ ఫ్రీ నంబర్‌ను ఉపయోగించుకోవాలి. క్షేత్ర స్థాయిలో ఉద్యోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడంతోపాటు వారికి కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తున్నాం.

శాఖాపరమైన పని తీరు మెరుగుదల కోసం తీసుకుంటున్న చర్యలు ఏమిటి?.

పనిలో మెరుగుదల కోసం శాఖాపరంగా కొన్ని చర్యలను ఉన్నతాధికారులు తీసుకున్నారు. జిల్లాకు మరొక కొత్త డివిజన్ ఏర్పాటు చేశారు. విజయనగరం రూరల్ డివిజన్ కొత్తగా అందుబాటులోకి వచ్చింది. కొత్తగా మెంటాడ, వుడా సెక్షన్లు ఏర్పాటు చేశారు.

లో ఓల్టేజ్ సమస్య పరిష్కారం కోసం తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జిల్లాల్లో లోఓల్టేజ్ సమస్య చాలా తక్కువగా ఉంది. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కూడా లోఓల్టేజ్ సమస్యపై పెద్దగా ఫిర్యాదులు రావడం లేదు. మరోవైపు జిల్లాలో విద్యుత్తు పంపిణీకి ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా పంపిణీ నెట్‌వర్క్, విద్యుత్ లైన్లు, స్థంభాలు, ఇంటర్ లింక్ వంటి వాటికి ప్రతిపాదనలు నెల రోజుల్లో సిద్ధం చేసి పంపిస్తాం.

వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్తు పునరుద్ధరణకు ముందస్తుగా ఎలా సన్నద్ధమయ్యారు?.

వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్తు ప్రమాదాలు జరిగిన వెంటనే సిబ్బంది అప్రమత్తంగా ఉండటంతోపాటు అందుబాటులో 150 వరకు విద్యుత్ స్తంభాలు, వైర్లు, పునరుద్ధరణకు కావాల్సిన సామగ్రిని సిద్ధంగా ఉంచాం. వర్షాకాలంలో ప్రజలకు ఏర్పడిన విద్యుత్తు అంతరాయాన్ని వెంటనే సరిచేసేలా ఉద్యోగులను, అందుకు తగిన మెటీరియల్‌ను సిద్ధంగా ఉంచాం.

జిల్లాల్లో వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్తు సరఫరా ఎలా ఉంది? ఈ ఏడాది ఎంతమంది రైతులకు కొత్త సర్వీసులిచ్చారు?.

జిల్లాలో రైతులకు పంటలకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటలు వరకు 9 గంటలపాటు విద్యుత్తు సరఫరా చేస్తున్నాం. అక్కడక్కడ వాతావరణ పరిస్థితుల కారణంగా అంతరాయం ఏర్పడితే రైతులకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో గత నాలుగు నెలల కాలంలో కొత్తగా 1334 సర్వీసులు రైతులకు ఇచ్చాం. జిల్లాలో 44,187 పంపు సీట్లకు విద్యుత్తు సరఫరా చేస్తున్నాం.

చెరువులో ఆస్పత్రి వ్యర్థాలు

• కలుషితమవుతున్న సింగవరం చెరువు • రోగాలు బారినపడుతున్న ప్రజలు, పశువులు • సుందరపేట సిహెచ్‌ఎన్‌సి సిబ్బంది నిర్వాకం

ప్రజాశక్తి- డెంకాడ

మనకేదైనా రోగం వస్తే ఆస్పత్రి సిబ్బంది అది తగ్గించేలా వ్యవహరించాలి. కొత్తగా ప్రజలకు రోగాలు సృష్టించకూడదు. కానీ భోగాపురం మండలంలోని సుందరపేట సిహెచ్‌ఎన్‌సి సిబ్బంది మాత్రం రోగాలను తగ్గించాల్సింది పోయి కొత్త రోగాలను సృష్టించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఆస్పత్రిలో ఉత్పన్నమవుతున్న వ్యర్థాలను ఆస్పత్రి మేనేజ్‌మెంట్ స్టోర్‌కు పంపించాల్సి ఉంది. కానీ నేరుగా ట్రాక్టర్ల ద్వారా డెంకాడ మండలంలోని సింగవరం గ్రామానికి చెందిన చెరువులో డంపింగ్ చేస్తున్నారు. దీంతో నీరు కలుషితమై పశువులు, మనుషులు రోగాల బారిన పడుతున్నారు.


చెరువు గర్భంలో వేసిన ఆస్పత్రి వ్యర్థాలు

భోగాపురం మండలంలోని సుందరపేట సిహెచ్‌సి నుంచి వస్తున్న వ్యర్థాలను గత వారం పది రోజుల నుంచి ట్రాక్టర్ ద్వారా తరలించి సింగవరం వద్ద చుక్కల చెరువు గర్భంలో వేస్తున్నారు. గ్రామస్తులు ఎంత చెబుతున్నా వినకుండా ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా చెరువులో వేస్తున్నారు. ఆసుపత్రిలో రోగులకు వైద్యం చేసిన అనంతరం ఉపయోగించిన సూదులు, సిరంజీ, బాటిల్స్, దూదులు, బ్యాండేజీలతో పాటు పోస్టుమార్టం అనంతరం వచ్చిన వ్యర్థాలను చెత్తలో కలిపి పడేస్తున్నారు. వాస్తవానికి ఆస్పత్రి నుంచి వచ్చిన చెత్తచెదారాలను ఆస్పత్రి మేనేజ్‌మెంట్ స్టోర్స్‌కి అందించాలి. దీని కోసం ఆస్పత్రి వర్గాలు ఆ స్టోర్స్‌లో డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. అక్కడ డబ్బులు చెల్లిస్తే వారే చెత్తను తీసుకెళ్లి జాగ్రత్తగా కాల్చివేస్తారు. దాని వల్ల ఎటువంటి ఇబ్బంది ఉండదు. కానీ ఈ ఆసుపత్రి సిబ్బంది ఆ డబ్బులను వారు మిగిల్చుకొని సింగవరం చుక్కల చెరువులో చెత్తను వదిలి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో చెరువులో నీరు కలుషితమైపోయి పశువులు వాటిని తాగడం వల్ల అనారోగ్యం బారిన పడుతున్నాయి. ఈ నీరు ద్వారా గ్రామస్తులు వ్యవసాయ పనులు చేస్తుండటంతో వారు కూడా రోగాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా సూదులు, సిరంజీలు, బ్లేడ్‌లను చెరువులో పడేయడం వల్ల సాగునీటి కోసం చెరువులోకి దిగిన రైతులకు, పశువుల కాపరులకు గుచ్చుకొని సెప్టిక్ అయి ప్రమాదం బారిన పడుతున్నారు. చెత్తలో అన్ని రకాల వ్యర్థాలూ కలవడం వల్ల విపరీతమైన వాసన వచ్చి ప్రజల అనారోగ్యానికి గురవుతున్నారు. చెత్తలో ఉన్న వ్యర్థాలను కుక్కలు పశువులు తినడం వల్ల అవి కూడా అనారోగ్యానికి గురవుతున్నాయి. ఇప్పటికైనా ఆసుపత్రి అధికార వర్గాలు స్పందించి చెరువు గర్భంలో చెత్త వేసిన వారిపై చర్యలు తీసుకుని ప్రజలు ఆరోగ్యాలను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.


వ్యర్థాల్లో ప్రమాదకరంగా ఉన్న సూదులు, సిరంజీలు

మొక్కలు పంపిణీ


ర్యాలీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి - శృంగవరపు కోట

ఆక్సిజన్ అత్యవసర వాయువు అని, అందుకోసం విరివిగా మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని 'ప్లాంట్ ఫర్ ఫ్యూచర్' సంస్థ కన్వీనర్ వెంపడాపు ఈశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక భవాని ఐటిఐ దగ్గర ప్లాంట్ ఫర్ ఫ్యూచర్ సంస్థ ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం రవీంద్ర భారతి పాఠశాలకు ఎదురుగా గల పెట్రోల్ బంకు వద్ద మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. 'పచ్చని చెట్టు- ప్రగతికి మెట్టు', 'మొక్కలు నాటుదాం- ఆక్సిజన్ అందిద్దాం' తదితర నినాదాలతో దేవి బొమ్మ జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించి మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం, పర్యావరణ పరిరక్షణ గురించి ప్రజలకు తెలియజేశారు. అనంతరం దేవి బొమ్మ జంక్షన్ నుండి భవాని ఐటిఐ వరకు చేరుకుని సుమారు 1000 మొక్కలను విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ ఫర్ ఫ్యూచర్ సంస్థ సభ్యులు మండ సత్య సాయిబి, జామి వెంకట రమణ, ఏడువాక గాయిత్రి, కంటకాపల్లి అటవీ శాఖ అధికారులు, కొట్యాడ, గొట్లాం పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి కృషి

ప్రజాశక్తి - సీతానగరం

ఈ ప్రాంత చిరకాల కోరికైన బూర్జ-చినఅంకలాం గ్రామాల మధ్య వంతెన నిర్మిస్తానని ఎమ్మెల్యే ఎ.జోగారావు హామీ ఇచ్చారు. మండలంలోని గాదెలవలసలో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్ర భవనాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రజల చెంతకు ప్రభుత్వ పాలనను తీసుకురావడమే కాకుండా రైతులకు అవసరమైన సేవలు ఆర్‌బికె ద్వారా అందజేస్తున్నామన్నారు. రైతులకు విత్తనాలు మొదలు పంట చేతికి వచ్చి తిరిగి అమ్ముకునే వరకు కూడా అన్ని సేవలు ఆర్‌బికెల ద్వారా అందుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బలగ రవణమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు మామిడి బాబ్జి, వైస్ ఎంపిపి టి.సూర్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, స్థానిక సర్పంచ్ బొమ్మాడ అన్నపూర్ణ, తిరుపతి రావు, మండల పార్టీ సీనియర్ నాయకులు పోల ఈశ్వర నారాయణ, తెంటు వెంకట అప్పల నాయుడు, ఆర్సీ, పిఎసిఎస్ చైర్మన్ బొమ్మాడ సత్యనారాయణ, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పంచాయతీ రాజ్ శాఖ డిఇ రత్నకర్, ఎఇ చంద్రశేఖర్, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కొటికిపెంటలో గడపగడపకు...

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని కొటికిపెంట, గరిశ్చవలస, కోడికాళ్లవలసలో గ్రామాల్లో సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సిఎం రాజన్న దొర ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం గత నాలుగేళ్లలో లబ్దిదారులకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలుంటే తెలియజేయాలని, సత్వర పరిష్కారం చేసేలా చర్యలు చేపడతామని తెలిపారు. ముఖ్యంగా కోటికి పెంట పెద్దగెడ్డ జలాశయం ముంపు గ్రామం వల్ల ప్రధాన సమస్య ఇళ్ల స్థలాలు కావడంతో తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని గ్రామస్తులు రాజన్నదొర దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన త్వరలో ఇళ్ల స్థలాలు కేటాయించి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి బి.ప్రమీల, ఎంపిడిఒ జి.పార్వతి, ఎఒ కె.తిరుపతిరావు, ఎంపిటిసి సభ్యులు డి.ఏడుకొండలు, వైసిపి నాయకులు డోల బాబ్జీ, పి.వీరమనాయుడు, టి.గౌరీశ్వరరావు, సరాది అప్పలనాయుడు, పలువురు సర్పంచులు, పలు శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలపై చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

వార్డుల్లో గుర్తించిన దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక 28వ వార్డులో కౌన్సిలర్ మజ్జి శేఖర్, చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ కొండపల్లి రుక్మిణి, ఇందుపూరు గున్నేశ్వర రావు, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, మున్సిపల్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్య పరిష్కార వేదిక అనే వినూత్న కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు వార్డులను సందర్శించి, అందులో భాగంగానే ఈ వార్డులో కార్యక్రమం నిర్వహించి సమస్యలను గుర్తించి వాటిని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడమే కాకుండా పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, స్థానిక వైసిపి నాయకులు, వివిధ వార్డుల సచివాలయం కన్వీనర్లు, గృహసారధులు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పరిధిలో ఖాళీగా ఉన్న 13 వాలంటీర్ పోస్టులకు మున్సిపల్ రెవెన్యూ అధికారి దిబ్బా రూబెన్, ఆరఓ పి.నారాయణరావు, మెప్మా సిఎంఎం విజయకుమార్, పవన్ కిరణ్, వేణుమాధవ్ అభ్యర్థులకు ఆదివారం ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పలు సచివాలయాల్లో ఖాళీలు ఉన్న 13 వాలంటీర్ పోస్టులకు గానూ 78 మంది దరఖాస్తులు చేసుకున్నారని, ఆదివారం జరిగే ఇంటర్వ్యూకు 58 మంది హాజరయ్యారని తెలిపారు. ఈ ఇంటర్వ్యూలో పాల్గొన్న అభ్యర్థుల ధ్రువ పత్రాలను పరిశీలించామని, అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాల కార్యక్రమాలపై వారి అవగాహనను తెలుసుకోవడం జరిగిందని అన్నారు. ఎంపికైన అభ్యర్థులను మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు నియమించడం జరుగుతుందని తెలిపారు.

సీతానగరం: మండలంలోని మూడు సచివాలయాల పరిధిలో ఖాళీ అయిన గ్రామ వాలంటీర్ల పోస్టులకు ఆదివారం స్థానిక ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బూర్జ-2, పెదఅంకలాం సచివాలయ పరిధిలో కృష్ణరాయపురం, పెదభోగిలిలో ఒక్కొక్క వాలంటీర్ పోస్టుల ఖాళీలు అవ్వగా, ఇదివరకే నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. మొత్తం ఆరు దరఖాస్తులు రాగా ఇంటర్వ్యూలకు నలుగురు హాజరయ్యారన్నారు. సోమవారం ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామన్నారు.

అక్రమ రోడ్డు నిర్మాణం ఆపే వరకు పోరాటం


గెడ్డను పరిశీలిస్తున్న లోకం మాధవి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కందివలస గెడ్డలో అక్రమంగా రోడ్డు నిర్మాణం చేపడుతున్న అరబిందో, శ్రేయస్ ఫార్మా సంస్థలుపై వెంటనే చర్యలు తీసుకోవాలని జనసేన నెల్లిమర్ల నియోజకవర్గం నాయకులు లోకం మాధవి అన్నారు. గెడ్డలో అక్రమ రహదారి నిర్మాణాన్ని ఆమె ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్రమ నిర్మాణం పై హైకోర్టు స్టే ఇచ్చినప్పటికీ, స్టే ఆర్డర్‌ని ధిక్కరిస్తూ పనులు కొనసాగించడం బరితెగింపన్నారు. గత 80 రోజులుగా హైవే దగ్గర నుండి నూతనంగా నిర్మిస్తున్న శ్రేయస్, అరబిందో ఫార్మా కంపెనీలకి మెటీరియల్ రవాణా సరఫరా కోసం కంపెనీ యాజమాన్యం గెడ్డవాగుని ఆక్రమించి రహదారి నిర్మాణం చేసుకుంటూ పోతుందన్నారు. ఈ సమస్య గురించి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన ఇద్దరు కలెక్టర్లకు వినతి పత్రాలు ఇచ్చామని అయినా పట్టించుకోకపోవడం గోరమన్నారు. కంది వలస గెడ్డని సుమారు 100 అడుగులు ఆక్రమించి ఈ రోడ్డు వేస్తున్నారని అధికారులు కన్నెత్తి చూడడం లేదని అన్నారు. ఈ రోడ్డు వేయడం వల్ల కంది వలస గెడ్డ చిన్నదయిపోతుందని, దాని వల్ల అల్లాడ పాలెం గ్రామం ముంపునకు గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ అధికారులు వీరికి ఏ కారణంతో అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. రహదారి నిర్మాణం కోసం ఇక్కడ యాజమాన్యం వందలాది క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తెచ్చి డంప్ చేశారని, దానికి మైన్స్ డిపార్ట్మెంట్ ఏ కారణంతో అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. ఇక్కడ రోడ్డుని ఆనుకొని ఉన్న ప్రాంతం దళితులదని, ఆ దళితులకి ఈరోజుటి వరకు ఎటువంటి పరిహారం అందజేయకుండా ఎపిఐసి సుమారు 45ఎకరాలు తీసుకుందని, వీరికి ఎపిఐసి ఏ కారణంతో అనుమతి ఇచ్చిందని ప్రశ్నించారు. ఎపిఐసికి దళితులకి కోర్టులో కేసు నడుస్తున్నా దాన్ని పక్కన పెట్టి అనుమతిచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి నిర్మాణం కోసం భారీగా గ్రావెల్ డంప్ చేయడంతో గెడ్డలో ఉన్న పైపులు డ్యామేజై భూగర్భ జలాలు కలుషితమయ్యాయని, దీంతో ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ అక్రమ భాగోతానికి అధికార పార్టీ నాయకులు కొమ్ముకాసున్నారని మండిపడ్డారు. అక్రమ నిర్మాణం ఆపే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. ఆమెతో పాటు పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


గేటు లేని ఆదర్శ పాఠశాల భవన సముదాయం

ఆదర్శ పాఠశాలకు రక్షణ కరువు

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రానికి కిలోమీటరు దూరంలో ఉన్న బక్కునాయుడు పేట వద్ద గల ఆదర్శ పాఠశాలకు రక్షణ కరువైంది. ఈ పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకూ సుమారు 600 మంది విద్యార్థులు చదువుతున్నారు. నాడు నేడు నిధులతో పాఠశాలలో అభివృద్ధి పనులతో పాటు ప్రహరీ నిర్మాణం కూడా చేపట్టారు. అయితే ప్రహరీకి ప్రధాన మార్గం వద్ద గేటు లేకపోవడంతో విచ్చలవిడిగా పశువులు పాఠశాల ఆవరణలో ప్రవేశించి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మేకలు, గొర్రెలు పాఠశాల ఆవరణలో వేసిన మొక్కలను పాడు చేస్తున్నాయి. ఈ పాఠశాల వసతి గృహంలో దూర ప్రాంతాలకు చెందిన 100 మంది బాలికలు ఉంటున్నారు. వీరంతా లోపలికి వస్తున్న పశువులతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలకు ఏర్పాటు చేసిన ప్రహరీ ప్రధాన మార్గం వద్ద గేటు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


బొబ్బిలిలో కురుస్తున్న వర్షం

బొబ్బిలిలో మోస్తారు వర్షం

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. రెండు వారాలుగా వర్షాలు లేకపోవడంతో రైతులు వేసిన వరినారు, వరినాట్లు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్న సమయంలో వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షం వరినారు, వరినాట్లుకు ప్రాణం పోసిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వంగరలో భారీ వర్షం

వంగర: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా వర్షం కురవకపోవడంతో పాటు, తోటపల్లి కుడి కాలువకు వంగర మండలంలోని శివారు గ్రామాలైన శివ్వాం, తలగాం, వంగర, యమ్ సీతారాం పురం తదితర గ్రామాలకు సాగునీరు అందక వరి నాట్లు ఇప్పటివరకు వేయలేదు. ఉన్నటువంటి ఎదలు తీవ్రమైన ఎండలకు ఎండిపోయిన పరిస్థితి. అయితే ఆదివారం కురిసిన భారీ వర్షం వల్ల ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రీ సర్వే వేగవంతం

ప్రజాశక్తి - బొబ్బిలి రూరల్

మండలంలోని రీ సర్వే పనులు వేగవంతం చెయ్యాలని తహశీల్దార్ డి. రాజేశ్వరరావు అన్నారు. ఆదివారం తన కార్యాలయం లో రీ సర్వే డేటాను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేసేందుకు ఆదివారం సెలవు దినంలో కూడా సిబ్బందితో పని చేయిస్తున్నామన్నారు. జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంలో భాగంగా కారాడ, కొండదేవుపల్లి, రాముడు వలసలో సర్వే జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిటి అప్పయ్య, రెవెన్యూ గ్రామాలకు సంబంధించి డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్ తయారీలో రెవెన్యూ, గ్రౌండ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఆన్‌లైన్‌లో రీసర్వేను పరిశీలిస్తున్న తహశీల్దార్


ప్రజాశక్తి- డెంకాడ
మండలంలోని సింగవరంలో స్వామి యోగానంద భారతి దివ్య జీవన సంఘం నిర్వహించిన సత్సంగ సభకు హాజరైన నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు..

ఆర్థిక సాయం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని మహారాజు పేట గ్రామానికి చెందిన గుడ్ల లక్ష్మి కేన్సర్‌తో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులు ఎమ్ఎస్ఎన్ రాజు, రాజు మాస్టర్ ఆధ్వర్యంలో ఆదివారం రూ. 70వేలు ఆర్థిక సాయం అందించారు. అదే గ్రామానికి చెందిన యాదవ్ యూత్ అసోసియేషన్ సభ్యులు మరో రూ. 35వేలు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో గురునాథ వెంకటరావు, శ్రీను, సతీష్, వెంకయ్య స్వామి, జగదీశ్, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

దేవాంగుల సంఘం మండల అధ్యక్షులుగా రవి

పాలకొండ: దేవాంగుల సంఘం పాలకొండ మండల అధ్యక్షుడిగా న్యాయవాది కర్రా రవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీవర్స్ కాలనీలోని చేనేత సహకార షెడ్‌లో ఆదివారం నిర్వహించిన దేవాంగ సంఘ సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నికున్నారు. నూతన అధ్యక్షుడిగా కర్రా రవి, ప్రధాన కార్యదర్శిగా తూతిక శ్రీనివాసరావు, కోశాధికారిగా బళ్ల భీమాలింగేశ్వరరావు, సభ్యులుగా బళ్ల వెంకటరావు, బత్తుల తవిటిరాజు, కొమ్మాన శ్రీనివాసరావు, గోరు రమేష్, బళ్ల షణ్ముఖరావు, కర్రా రాజు, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు కన్వీనర్లకు శిక్షణ

డెంకాడ : నియోజకవర్గ స్థాయి సచివాలయ కన్వీనర్ల శిక్షణ కార్యక్రమం మండలంలోని పెదతాడివాడ వద్ద ఉన్న పివిఆర్ కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన మజ్జి శ్రీనివాసరావు, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్ బాబు, నియోజవర్గ పార్టీ పరిశీలకుడు అందవరపు సూరిబాబు హాజరవుతారని చెప్పారు. నాలుగు మండలాల పార్టీ నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న డైరెక్టర్లు, సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ కన్వీనర్లు హాజరుకావాలని కోరారు.

ఆచూకీ తెలపండి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

తంగుడు బిల్లి గ్రామానికి చెందిన చందక రామారావు విజయనగరం ఆసుపత్రికి వెళ్తున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. బంధువుల ఇంటికి కూడా చేరలేదని ఈ నేపథ్యంలో స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేసినట్లు తెలి పారు. ఎవ రికైనా ఆచూకీ తెలిస్తే 80961 57213 కాల్ చేయాలన్నారు.


రామారావు (ఫైల్)

సెలవు రోజుల్లో కలప అక్రమ రవాణా

ప్రజాశక్తి - వేపాడ

వేపాడ గ్రామ రెవెన్యూ పరిధిలో ఏ విధమైన అనుమతులూ లేకుండా కలప వ్యాపారస్తులు నీలగిరి చెట్లు, అకేసియా చెట్లతో పాటు భారీ టేకు వృక్షాలను నరికి వేస్తూ రాత్రి సమయంలో మినీ వ్యానులు ద్వారా తరలించేస్తున్నారు. పలుమార్లు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ వ్యాపారస్తులకే వారు సహకరిస్తున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. పైగా ఆదివారం ఇతర ప్రభుత్వ సెలవు రోజుల్లో ఈ అక్రమ కలప రవాణా మరింత జోరుగా సాగుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పర్యావరణ పరిరక్షణ నిబంధనలు పాటించి అక్రమ కలప రవాణాను అరికట్టాలని కోరుతున్నారు.


చెట్టును తొలగించిన స్థలం ఇదే..

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక సికెఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1992-93 పదో తరగతి పూర్వ విద్యార్థులు అపూర్వ కలయిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా 30 సంవత్సరాల క్రితం చదువుకుని వివిధ హోదాల్లో ఉన్న వారందరూ కలుసుకొని పాత జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ గుర్తు తెచ్చుకున్నారు. సికెఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1992-93 టెన్త్ బ్యాచ్‌లో గాంధీ నగర్ కాలనీకి చెందిన టి. ఉమా మహేశ్వర అనే ఎన్ఆర్ఐ మహిళ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ 30సంవత్సరాల క్రితం చదువుకున్న తనను పూర్వ విద్యార్థుల కలయికకు ఆహ్వానించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎస్.రఘు, పి.చిరంజీవి, కవిశెట్టి, ఆర్. చంద్రశేఖర్, టి.మహేష్, ఎం. బుజ్జి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


ఒకే దగ్గర సందడి చేస్తున్న పూర్వ విద్యార్థులు

నేరాలు ఘోరాలు

భవనంపై నుంచి పడి వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- బొబ్బిలి

నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి జారిపడి కర్రల మిల్లు కట్టర్ దుమ్ము దుర్వాసులు(45) దుర్మరణం చెందాడు. శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పాలవలస గ్రామానికి చెందిన దుర్వాసులు కోర్టు జంక్షన్‌లో ఉన్న షామిల్లులో కట్టర్‌గా పని చేస్తున్నాడు. ప్రతిరోజు రాత్రి భోజనం చేసిన తర్వాత షామిల్లు సమీపంలో నిర్మాణంలో ఉన్న భవనంపై దుర్వాసులు నిద్రిస్తూ ఉంటాడు. శనివారం రాత్రి దుర్వాసులు మద్యం తాగి నిద్రించేందుకు వెళ్లాడు. అర్ధరాత్రి మూత్ర విసర్జన కోసం నిద్రలేచి మద్యం, నిద్రమత్తులో ప్రమాదవశాత్తు కిందకు పడిపోవడంతో దుర్వాసులు తలకు బలమైన గాయమై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఆదివారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని కేసు నమోదు చేసి ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్దదిక్కు మరణించడంతో కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు.


సంఘటనా స్థలంలో మృతి చెందిన దుర్వాసులు

కెంగువలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - గజపతినగరం

మండలంలోని కెంగువలో పారిశుధ్య పనులను సర్పంచ్ కె.సూరప్పుడు, వైసిపి యువజన నాయకులు లెంక గణేష్ పర్య వేక్షణలో ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీధి కాలువలు నీరు నిల్వ చెత్తా చెదారంతో నిండి దోమలకు ఆశ్రయాలుగా మారి సీజనల్ వ్యాధులను వ్యాపించే అవకాశం లేకుండా ముందుగా ఎప్పటికప్పుడు ప్రజా ఆరోగ్యం దృష్ట్యా పారిశుధ్య పనులు చేపడుతు న్నామని అన్నారు.


పనులు చేస్తున్న కూలీలు